విశాలాంధ్ర గుంటూరు జిల్లా

కాపు సంఘాలతో ఎమ్మెల్యే సమావేశం

విశాలాంధ్ర-తెనాలి : వైసీపీ పాలనలో కాపులకు వివిధ పథకాలను జగన్‌మోహనరెడ్డి అందజేశారని రాష్ట్రంలోని కాపులందరూ పార్టీకి అండగా నిలిచి బలోపేతానికి సహకరిస్తున్నారని తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. స్థానిక రామలింగేశ్వరపేట, 11వ వార్డులో వైసీపీ ఆధ్వర్యంలో కాపు సంఘీయులతో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సమావేశానికి పార్టీ సీనియర్ నాయకుడు కఠారి హరీష్ అధ్యక్షత వహించగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 45 సంవత్సరాలు దాటిన కాపు మహిళలకు కాపునేస్తం పథకం ద్వారా లబ్ది చేకూర్చారన్నారు. కార్యక్రమంలో పలువురు కాపు నాయకులు, వైఎస్సార్ సిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

విశాలాంధ్ర-తాడేపల్లి: పట్టణంలోని పోలింగ్ కేంద్రాలను మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, గుంటూరు సంయుక్త కలెక్టరు రాజకుమారి గణియా సోమవారం పరిశీలించారు. సార్వత్రిక ఎన్నికలను విజయవంతంగా నిర్వహణకుగాను మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గం, తాడేపల్లి మండలంలోని సెక్టారు-5, 6లో గల 26 పోలింగ్ కేంద్రాలను సంయుక్త కలెక్టర్ సందర్శించి, పోలింగు సిబ్బందికి, ఓటర్లకు కావలసిన కనీస సౌకర్యాలైన ఫ్యానులు, లైట్లు, ఫర్నీచర్, తాగునీటి వసతి, టాయిలెట్ల వద్ద నీటి సౌకర్యం, గ్రౌండ్ లెవెలింగ్, వృద్దులు, దివ్యాంగుల కొరకు ఏర్పాటు చేసిన ర్యాంపులను పరిశీలించారు. బూత్ లెవెల్ అధికారులకు వారి సంబందిత పోలింగ్ కేంద్రాలలో పోలింగ్ రోజున ఓటర్ సహాయ బూత్ ద్వారా ఓటర్లకు కావలసిన సహాయ, సహకారాలు అందించాలని తెలిపారు.

వాలంటీర్లు రాజీనామా

విశాలాంధ్ర-తుళ్లూరు: 40 మంది వాలంటీర్లు సోమవారం రాజీనామా చేశారు. మండలంలోని బోరుపాలెం, అబ్బురాజుపాలెం, హరిశ్చంద్రపురం, మందడం గ్రామాల వాలంటీర్లు ఎంపీడీవో శివన్నారాయణను కలిసి రాజీనామా విషయాన్ని తెలియజేశారు. వ్యక్తిగత కారణాల రీత్యా రాజీనామా చేశామని చెప్పారు. మండల పరిధిలో 270 మంది వాలంటీర్లు ఉన్నారు.

ముమ్మరంగా శనగ కల్లాలు

విశాలాంధ్ర-తాడికొండ: ఈ ఏడాది రబీ సీజన్లో రైతులు వేసిన శనగ పంట చేతి కొచ్చింది. కోతల అనంతరం ముమ్మరంగా కల్లాల పనులు కొనసాగుతున్నాయి. మండలంలో 3000 ఎకరాల పైబడి రైతులు శనగ పంటను సాగు చేశారు. ఎక్కువగా మిషన్ల ద్వారా పంటను నూర్పిడి చేస్తున్నారు. ఎకరాకు ఐదు నుండి పది క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. ఎకరా కల్లానికి నూర్పిడి చేసినందుకు మిషన్లు, కూలీలకు రైతులు రూ.4000 చెల్లిస్తున్నారు. క్వింటా శనగలు రూ.5500 లకు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు.

మూకుమ్మడి రాజీనామా

విశాలాంధ్ర-తాడేపల్లి: మెల్లంపూడిలో సోమవారం 12 మంది వాలంటీర్లు మూకుమ్మడిగా రాజీనామా చేశారు. తామంతా ఇష్టపూర్వకంగానే రాజీనామా చేస్తున్నామని పేర్కొన్నారు. మొత్తం15 మంది వాలంటీర్లు ఉన్నారు. పెనుమాక గ్రామంలోని రెండు సచివాలయాల పరిధిలో 46 మంది వాలంటీర్లకు గాను 43 మంది వాలంటీర్లు రాజీనామా చేశారు. మంగళగిరి నియోజకవర్గంలో ఇప్పటివరకు 300 మందికి పైగా వాలంటీర్లు రాజీనామా చేయడం రాజకీయంగా తీవ్ర చర్చనీయాంశమైంది.

యువకుడి దారుణ హత్య

విశాలాంధ్ర-పొన్నూరు: డివిసి కాలనీ సమీపంలో యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. యాజలి గోపి (37) యువకుడిని గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. తల మీద మద్యం సీసాలతో కొట్టి హత్య చేసినట్లు భావిస్తున్నారు. హత్య ఎవరు చేశారు? ఎందుకు చేశారనే కోణంలో అర్బన్ సీఐ పీ భాస్కర్ నేతృత్వంలో విచారణ కొనసాగుతుంది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఆస్తి పన్ను మొత్తం చెల్లిస్తే 5 శాతం రాయితీ

విశాలాంధ్ర-మంగళగిరి: 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఏడాది ఆస్తి పన్ను ఏక మొత్తము ఏప్రిల్ 30 తేదీ లోపు ముందస్తు చెల్లింపుపై 5శాతం రాయితీ కల్పిస్తారని ఎంటియంసి కమీషనర్ నిర్మల్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పన్ను చెల్లించడానికి వీలుగా ప్రతి సచివాలయంలో కౌంటర్లు, యంటియంసి ప్రధాన కార్యాలయం, తాడేపల్లి కార్యాలయం నందు అదనపు కౌంటర్లు, హెల్ప్ డెస్క్ లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పన్ను చెల్లింపు దారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమీషనర్ తెలిపారు.

మహానాడులో టీడీపీ ఇంటింటి ప్రచారం

విశాలాంధ్ర-తాడేపల్లి: మహానాడు 21వ వార్డులో సోమవారం సాయంత్రం టిడిపి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు సూచనల మేరకు, మాజీ కౌన్సిలర్ చిన్న పోతుల చిన్న (సుబ్బారావు) ఆధ్వర్యంలో ఇంటింటికి ప్రచార కార్యక్రమం నిర్వహించారు. మంగళగిరిలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంగళగిరి నియోజకవర్గ అభ్యర్థి నారా లోకేష్, గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి పేమ్మ స్వామి చంద్రశేఖర్‌లకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. 21 వార్డ్ అధ్యక్షులు గాజుల శ్రీనివాస్, గరికే అంకలరావు, సైదా, మోకా చంద్రబాబు, అశోక్, కొసరాజు సైలెజా, కాల రాంబాబు, ఇట్టా భాస్కర్, అన్నెం కుసుమ, మాలిక, పండు, తదితరులు పాల్గొన్నారు.

పోలకంపాడులో మై ఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎన్

విశాలాంధ్ర-తాడేపల్లి: మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని పోలకంపాడు 11వ బూత్‌లో సోమవారం సాయంత్రం తెలుగు యువత గుంటూరు పార్లమెంటు ఉపాధ్యక్షులు జంగాల వెంకటేష్ ఆధ్వర్యంలో ఇంటింటికి మై ఫస్ట్ ఓట్ ఫర్ సి.బి.ఎన్. కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జంగాల వెంకటేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో గత ఐదేళ్లలో నిరుద్యోగం బాగా పెరిగిందని ఉద్యోగ కల్పన లేక యువత భవిష్యత్తు అగమ్య గోచరంగా ఉందని అన్నారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే యువతకు ఉద్యోగ అవకాశాలు రావాలంటే చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి ఆకుల జై సత్య, దొప్పలపూడి జ్యోతి బసు, తమ్మా శంకర్ రెడ్డి, రాయపూడి కిరణ్, సిగిరి శెట్టి లీలా కృష్ణా, సింగంశెట్టి తేజదర్, సింగంశెట్టి నాగేంద్ర, ప్రశాంత్, లాం నరేష్, సింగం శెట్టి శ్రీనివాసరావు, వంగా నరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఇండియా కూటమి గెలవకపోతే
దేశంలో మతకల్లోలాలు: జంగాల

విశాలాంధ్ర-ప్రత్తిపాడు: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఇండియా కూటమి గెలవకపోతే దేశంలో మతకల్లోలాలు చెలరేగుతాయని, ప్రధాని నరేంద్ర మోడీ కుంభస్థలంలో కొడితే ఆ కూటమి బీటలు పడతాయని ఇండియా కూటమి గుంటూరు పార్లమెంటు అభ్యర్థి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్ కుమార్ అన్నారు. స్థానిక ప్రత్తిపాడు సీపీఐ కార్యాలయంలో నియోజకవర్గ కార్యకర్తల సమావేశం జరిగింది. ప్రతిపాడు నియోజక వర్గ కార్యదర్శి రామిశెట్టి అదేశ్వరరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన జంగాల అజయ్ కుమార్ మాట్లా డుతూ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, సీఎం జగన్మోహన్ రెడ్డి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ నరేంద్ర మోడీ చేతిలో తోలుబొమ్మలని వాళ్లు పగలు కయ్యం రాత్రి నెయ్యం లాగా వ్యవహరిస్తుంటారని విమర్శించారు. పది సంవత్సరాలు బెయిల్ మీద ఉన్న ముఖ్యమంత్రి ఈ మధ్య దొరికిన చంద్రబాబు కూడా బెయిల్ మీద ఉన్నారని ఆయన విమర్శించారు. వీరిని నమ్మవద్దని ఇండియా కూటమి బలపరిచిన కంకి కొడవలికి ప్రతిపాడు నియోజకవర్గంలో అత్యధిక ఓట్లు రావాలని ఆయన కార్యకర్తలను కోరారు. గుంటూరు నగర కార్యదర్శి కోటా మాల్యాద్రి మాట్లాడుతూ అధిక ధరల వలన సామాన్యుడు బతకలేకపోతున్నాడని, ఎన్డీఏ కూటమిని ఓడించి ఇండియా కూటమి బలపరిచిన జంగాల అజయ్ కుమార్‌ను గెలిపించాలని ఆయన కోరారు. జిల్లా రైతు సంఘం అధ్యక్షులు కొల్లి రంగారెడ్డి మాట్లాడుతూ రైతులు గిట్టుబాటు ధరలు లేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ప్రభుత్వం వెంటనే స్పందించి గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మేడా హనుమంత రావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడు 50 రూపాయలు పెట్రోల్ ధర ఈరోజు 110 రూపాయలకు చేరిందని, వంట గ్యాస్ ధర రూ.350ల నుంచి రూ.1000లకు ఎగబాకిందని సామా న్యులు ప్రభుత్వంలో బతకలేకపోతున్నారని నరేంద్ర మోడీని ఓడించాలని కోరారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు ఏ అరుణ్ కుమార్ మాట్లాడుతూ నిరుద్యోగ సమస్య నానాటికి తీవ్రమవుతుందని యువతకు ఉపాధి కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం గుంటూరు జిల్లా పార్లమెంటు ఇండియా కూటమి బలపరిచిన జంగాల అజయ్ కుమార్‌కు సన్మానం జరిగింది. కార్యక్రమంలో ప్రత్తిపాడు నియోజవర్గ రైతు సంఘం నాయకులు ముప్పాళ్ళ అమరలింగేశ్వర రావు, ప్రత్తిపాడు సీపీఐ మండల కార్యదర్శి ఎం.అంకమ్మరావు, ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షులు కుంచాల అంకమ్మ రావు, ఏఐటీయూసీ నియోజవర్గ కార్యదర్శి సిద్ది రవి, నాయకులు గోపిరెడ్డి, నాగిరెడ్డి, మేడా తాతారావు, భాస్కర్, పార్టీ నాయకులు వీరారావు, వెంకట్రావు, ఉప్పల పాడు సీపీఐ నాయకులు బ్రహ్మయ్య, రామారావు, కాంగ్రెస్ నాయకులు చెరుకూరి శ్రీనివాసరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాగునీటి చెరువులు నింపేందుకు పకడ్బందీ చర్యలు : కలెక్టర్

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: జిల్లాలో నాగర్జున సాగర్ కుడి కెనాల్, కృష్ణా వెస్టన్ డెల్టా కెనాల్ పరిధిలో ఉన్న తాగునీటి చెరువులను పూర్తిస్థాయిలో నింపేందుకు ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యుఎస్, పంచాయతీ రాజ్, రెవెన్యూ అధికారుల సమన్వయంతో పకడ్బందీ ప్రణాళికతో అవసరమైన చర్యలు తీసుకున్నామని కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా కెఎస్ జవహర్ రెడ్డికి తెలిపారు. సోమవారం వెగపూడిలోని రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా. కెఎస్ జవహర్ రెడ్డి తాగునీరు, ఉపాధి హామీ పనులు, విద్యుత్ సరఫరా పరిస్థితులపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. కలెక్టరేట్ వీసీ సమావేశ మందిరం నుంచి పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ తాగునీటి అవసరాల కోసం నాగర్జున సాగర్ కుడి కెనాల్ కు, కృష్ణా వెస్టన్ డెల్టా కెనాల్‌కు విడుదల చేసిన నీటిని సక్రమంగా తాగునీటి చెరువులు నింపేందుకు గ్రామ, మండల, రెవెన్యూ డివిజన్, జిల్లా స్థాయిలో నిరంతరం పర్యవేక్షించటం జరుగుతుందన్నారు. చెరువులు నింపే ప్రక్రియ పూర్తి అయ్యేవరకు అధికారులు అప్రమత్తంగా ఉండి సమన్వయంతో పనిచేయాలని టెలికాన్ఫరెన్స్ ద్వారా ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామని కలెక్టర్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డికి వివరించారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఈ సురేష్, ఇరిగేషన్ ఎస్‌ఈ ఉమామహేశ్వరరావు, పబ్లిక్ హెల్త్ ఎస్‌ఈ శ్రీనివాస్, డ్వామా పీడీ పద్మావతి, డీపీఓ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

అంబటి ఎన్నికల ప్రచారం

విశాలాంధ్ర-పొన్నూరు: పట్టణంలోని 6, 7 వార్డుల్లో సోమవారం వైసీపీ అభ్యర్థి అంబటి మురళీకృష్ణ ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. వార్డులో ప్రజలకు నవరత్నాల సంక్షేమ పథకాలను వివరిస్తూ ముందుకు సాగారు. రాబోయే రోజుల్లో సంక్షేమ పథకాలు, రాష్ట్ర అభివృద్ధి కావాలంటే వైసీపీకి ఓటు వేసి గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. ప్రజలు అంబటికి ఘన స్వాగతం పలికారు. వైసీపీ శ్రేణులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో మందుల కేంద్రాలు ప్రారంభం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : గుంటూరు ప్రభుత్వ సమగ్ర (జీజీహెచ్)ఆసుపత్రి గుండె జబ్బుల ఓపి వద్ద మందులు ఇచ్చే కేంద్రం వద్ద రోగుల కోసం మూడు మందుల కేంద్రాలను ప్రారంభించినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ చెప్పారు. గుండె జబ్బుల ఓపి వద్ద రోజురోజుకు రోగులు పెరిగిపోతున్నారని, వారికి అవసరమైన మందుల కేంద్రాలను ఎక్కువగా ప్రారంభించాలన్న ఉద్దేశ్యంతో మూడు కేంద్రాలను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు చెప్పారు. అంతకు ముందు ఈ ప్రాంతమంతా ఒక అటవీ ప్రాంతాన్ని తలపించే విధంగా ఉండేదని, ప్రస్తుతం ఆ ప్రాంతాన్ని పరిశుభ్రంగా చేసి రోగులకు పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించినట్లు పేర్కొన్నారు. ఈ ప్రాంతాన్ని పరిశుభ్రం చేసేందుకు ప్రతి ఒక్కరూ నడుం బిగించి శ్రమదానం చేశారని, శానిటేషన్ సిబ్బంది నుంచి నాలుగో తరగతి ఉద్యోగి వరకు ప్రతి ఒక్కరూ శ్రమ చేసి ఈ ప్రాంతాన్ని పరిశుభ్రంగా అందించినట్టు ఆయన స్పష్టంచేశారు. ఆసుపత్రి అభివృద్ధి కోసం ప్రతి ఉద్యోగి భాగస్వాములవుతున్నందుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు కూడా ఆసుపత్రి పరిశుభ్రతకు సహకరించాలని అయన కోరారు.

శివాలయంలో అన్నదానం

విశాలాంధ్ర-మంగళగిరి : మంగళగిరి శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వారి దేవస్థానంలో సోమవారం అమావాస్యను పురస్కరించుకొని శ్రీ కాశి అన్నపూర్ణేశ్వరి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. అనంతరం ట్రస్ట్ చైర్మన్ పందేటి సాంబశివరావు మాట్లాడుతూ దాతల సహకారంతో ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతినెల అమావాస్య ముందు వచ్చే ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ట్రస్ట్ చైర్మన్ పందేటి సాంబశివరావు, ప్రతినిధులు కర్నాటి శివ సత్యనారాయణ, నంగళం ప్రసాద్, జూట్రు ఏడుకొండలు, కటారి విష్ణుమూర్తి, దోగిపర్తి శ్రీహరిరావు, దుంపల సాములు, కగ్గా శ్రీనివాసరావు, అన్నపురెడ్డి రామకృష్ణారెడ్డి, మన్నెం రమేష్, దామర్ల నాగరాజు, వీరస్వామి, వెంకటేశ్వరరావు, బిక్షారావు, మల్లి పాల్గొన్నారు.

పీడబ్ల్యూడీ ఓట్లపై అవగాహన ఉండాలి

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సార్వత్రిక ఎన్నికల్లో పిడబ్ల్యుడి(హెూం ఓటింగ్) ఓట్లపై బిఎల్‌ఓలు, సెక్టార్ అధికారులు సమగ్ర అవగాహన కల్గి ఉండాలని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి (ఆర్‌ఓ) కీర్తి చేకూరి అన్నారు. సోమవారం స్థానిక రెవెన్యూ కళ్యాణ మండపంలో బిఎల్‌ఓలు, సూపర్వైజర్లు, సెక్టార్, రూట్ అధికారులతో హెూం ఓటింగ్, ఓటింగ్ శాతం పెంపు, ఇతర ఎన్నికల విధులపై ప్రత్యేక సమావేశం జరిగింది. కమిషనర్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నూతనంగా అమలు చేయనున్న పర్సన్ విత్ డిజేబుల్ పై ప్రతి బిఎల్‌ఓ, సెక్టార్ అధికారి సమగ్ర అవగాహన కల్గి ఉండాలన్నారు. హెూం ఓటింగ్‌కు ఎంపిక చేసిన వారి వివరాలు ఫారం 12 డి ద్వారా రిటర్నింగ్ అధికారికి ముందుగానే అందించాలని, ఓటింగ్ కి సంబంధించి స్థానిక పిఓ, మైక్రో అబ్జర్వర్, మరొక పిఓ, వీడియోగ్రాఫర్ సమక్షంలోనే జరుగుతుందని తెలిపారు. ఎన్నికల విధులు ఒకరికొకరు సమన్వయంతో పని చేయాలని, సెక్టార్ అధికారులతో సమన్వయం చేసుకోకుండా, ఫోన్ కాల్స్ కి రెస్పాండ్ అవ్వడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు ఫిర్యాదు అందిన సూపర్వైజర్ రవి కిరణ్(ఏఈ), 150, 248, 74, పోలింగ్ స్టేషన్ల బిఎల్‌ఓలు ఎం.రామచంద్రరావు, వై.త్యాగరాజు, కె.అనిల్ కుమార్ లకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఎన్నికల విభాగ సూపరిండెంట్ ను ఆదేశించారు. సమావేశంలో ఏఆర్‌ఓలు ప్రదీప్ కుమార్, సునీల్, భీమరాజు, మేనేజర్ ఎస్.ఎన్.ప్రసాద్, ఎన్నికల విభాగ సూపరిండెంట్ పద్మ, మాస్టర్ ట్రైనర్ రవి, సెక్టార్, రూట్ అధికారులు, సూపర్వైజర్లు, బిఎల్‌ఓలు పాల్గొన్నారు.

ఐఎన్‌టీఎస్‌ఓలో శ్రీచైతన్య విద్యార్థుల విజయభేరి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ఇండియన్ నేషనల్ టాలెంట్ సర్చ్ ఒలంపియాడ్ (ఐఎన్‌టీఎస్‌ఓ)లో గుంటూరు జిల్లాలోని శ్రీచైతన్య స్కూల్స్ విద్యార్థులు తమ ప్రతిభతో విజయకేతనం ఎగురవేశారని శ్రీచైతన్య స్కూల్స్ ఏజీఎం డాక్టర్ నూతలపాటి అంజయ్య పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఏర్పాటు చేసిన అభినందన సభలో ప్రతిభ చూపిన విద్యార్థులను డాక్టర్ నూతలపాటి అంజయ్య, ఆర్‌ఐలు అప్పాజీ, సీహెచ్. సురేంద్రలు అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీచైతన్య స్కూల్స్‌లో చదువుతో పాటుగా అన్ని రంగాలలో ప్రతిభావంతులుగా తీర్చిదిద్దుతామని అన్నారు. ఇటీవల అమెరికా వారు నిర్వహించిన నాసా స్పేస్ సెటిల్మెంట్ కాంటెస్ట్‌లో శ్యామలానగర్, గుంటూరు రెసిడెన్షియల్, తెనాలి-3, తెనాలి-4 బ్రాంచిల నుంచి ఆరు ప్రాజెక్టులతో శ్రీచైతన్య విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో తమ ప్రతిభను ప్రదర్శించినట్లు వారు పేర్కొన్నారు. అదేవిధంగా ఐఎన్‌టీఎస్‌ఓలో గుంటూరు జిల్లా నుంచి ఐదుగురు విద్యార్థులు గ్రాండ్ ప్రైజ్‌గా ల్యాప్టాప్‌లను..13 మంది విద్యార్థులు ప్రథమ బహుమతిగా ట్యాబ్‌లను కైవసం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ కో-ఆర్డినేటర్లు, ప్రిన్సిపల్స్, డీన్స్, ఇన్‌చార్జులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ఎంలో ఎన్ఎంఆర్ సెంటర్ ప్రారంభం

విశాలాంధ్ర-మంగళగిరి: ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో పరిశోధనల పరంగా జరుగుతున్న అభివృద్ధి ప్రశంసనీయమని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (హైదరాబాద్) మాజీ డైరెక్టర్, ఇన్స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (ముంబయి) డైరెక్టర్ ఆచార్య మన్నేపల్లి లక్ష్మీకాంతం పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం పరిశోధనలను ప్రోత్సహించే ఉద్దేశంతో మంజూరు చేస్తున్న వివిధ రకాల గ్రాంట్లను సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. కేంద్ర ప్రభుత్వం డిపార్ట్మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ద్వారా మంజూరు చేసిన రూ.2.20 కోట్ల నిధులతో ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ఏర్పాటు చేసిన ఎన్ఎంఆర్ (న్యూక్లియర్ మాగ్నటిక్ రెసోనెన్స్) సెంటర్ను సోమవారం ఉదయం ఆచార్య లక్ష్మీకాంతం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె వర్సిటీ పరిశోధనా రంగ విద్యార్థులు, ప్రొఫెసర్లను ఉద్దేశించి మాట్లాడారు. ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ప్రొఫెసర్లు తయారు చేస్తున్న పరిశోధనా పత్రాలు నూతన ఆవిష్కరణలకు ప్రాణం పోస్తున్నాయనీ, భవిష్యత్తులో ఎస్ఆర్ఎం యూనివర్సిటీ అద్భుతాలు సృష్టించడం ఖాయమని కొనియాడారు. వైస్ ఛాన్సలర్ ఆచార్య మనోజ్కుమార్ ఆరోరా మాట్లాడుతూ, పరిశోధనలకు అవసరమైన అన్ని సదుపాయాలను కల్పిస్తున్నామనీ, ఇందులో భాగంగానే ఈ నెల 13న రీసెర్చ్ సమ్మేళనాన్ని నిర్వహించనున్నామన్నారు. వర్సిటీ పరిశోధనల పురోగతి కోసం శ్రమిస్తున్న నారాయణరావు, మన్నాథన్, రంజిత్ థాపాలను ఎన్ఎంఆర్గా వీసీ అభివర్ణించారు. యూనివర్సిటీలోని ప్రతి ఒక్క ప్రొఫెసరూ నూతన ఆవిష్కరణల కోసం శ్రమించాలనీ, దృఢ సంకల్పం ఉంటే సాధ్యం కానిది లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ దశాబ్దంలో ఎన్నో జాతీయ పరిశోధనా మిషన్లను ప్రారంభించి గ్రాంట్లు మంజూరు చేస్తుందనీ, వీటి కోసం యూనివర్సిటీ ప్రొఫెసర్లు విస్తృతంగా కృషి చేయాలని నారాయణరావు కోరారు. పరమాణు నిర్మాణంలోని అణువుల శాతాన్ని వాటి స్వచ్ఛతను గుర్తించేందుకు ఎన్ఎంఆర్ మిషన్ ఎంతగానో ఉపయోగపడుతుందని సెంటర్ ఇన్చార్జి డాక్టర్ మన్నాథన్ పేర్కొన్నారు. యూనివర్సిటీ సలహాదారు ఆచార్య వజ్జా సాంబశివరావు, రిజిస్ట్రార్ డాక్టర్ ప్రేమ్కుమార్, రీసెర్చ్ డీన్ డాక్టర్ రంజిత్ థాపా, ఆకడమిక్స్ డీన్ డాక్టర్ వినాయక్ తదితరులు పాల్గొన్నారు.

హోమియో వైద్యంతో త్వరితగతిన ఉపశమనం

ప్రముఖ హోమియో వైద్య నిపుణులు డాక్టర్ నాగేశ్వరరావు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : హోమియో వైద్యంలో వ్యాధి నయమవుటకు ఎక్కువ సమయం పడుతుందన్న అపోహలు ఉన్నాయని, కానీ అది వాస్తవం కాదని, హోమియో వైద్యం త్వరితగతిన ఉపశమనం కలుగుతుందని ప్రముఖ సీనియర్ హోమియో వైద్య నిపుణులు డాక్టర్ కోటపాటి నాగేశ్వరరావు తెలిపారు. హోమియో వైద్యం వలన మంచి ఫలితాలు వస్తాయని పేర్కొన్నారు. స్థానిక అవగాహన సంస్థ కార్యాలయంలో జరిగిన ఆరోగ్య సభలో డాక్టర్ ఆయన మాట్లాడారు. హోమియో వైద్యం పట్ల అవగాహన సంస్థ సీనియర్ సిటిజన్స్‌కు అవగాహన కల్పించారు. జర్మనీలోని అలోపతిలో మాస్టర్ పట్టాను పొందిన హనిమన్ హోమియో వైద్యాన్ని ప్రపంచానికి పరిచయం చేశాడన్నారు. ఈ నేపథ్యంలో ప్రతి సంవత్సరం ఆయన జన్మదినం రోజు ఏప్రిల్-10న హోమియో వైద్యులందరూ పండుగగా జరుపుకుంటారన్నారు. ఆయన జీవితాన్ని త్యాగం చేసి మరీ ఈ హోమియో వైద్యాన్ని ప్రపంచానికి అందించాలనే ఉద్దేశ్యంతో చాలా కృషి చేసినట్లు తెలిపారు. హోమియో వైద్యంలో తీసుకుని ఔషధం చాలా తక్కువ పవర్ ఉపయోగించడం వల్ల వ్యాధిగ్రస్తులకు దుష్పరిణామాలు లేకుండా స్వస్థత చేకూర్చడంలో సహాయకారిగా ఉపయోగపడుతుందని చెప్పారు. హోమియో వైద్య విధానంలో రోగాన్ని మూలం నుంచి తెలుసుకుని దాని పూర్తి నిర్మూలనకు వైద్యం ఇవ్వబడటం జరుగుతుందని, ఇది తక్కువ ఖర్చుతో..సైడ్ ఎఫెక్ట్ లేని వైద్యం చేయగలిగే పద్ధతి అని వెల్లడించారు. కొన్ని రకాల అనారోగ్య సమస్యలకు అలోపతి మంచి పరిష్కారం అయినప్పటికీ చాలా అనారోగ్య సమస్యలకు హోమియోలో చక్కటి పరిష్కారం దొరుకుతుందన్నారు. హోమియోలో చర్మ వ్యాధులకు..స్త్రీ సంబంధిత వ్యాధులకు..మానసిక వ్యాధులకు అద్భుత పరిష్కారాలు దొరుకుతాయని డాక్టర్ కోటపాటి నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శివరామిరెడ్డి, సాయిరాం, చంద్రశేఖర్, కోటేశ్వరరావు, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఎల్వోల ద్వారా ఓటర్ స్లిప్పులు అందిస్తాం

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: సార్వత్రిక ఎన్నికల్లో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు బిఎల్‌ఓల ద్వారా ప్రతి ఓటర్‌కు ఓటు స్లిప్ అందిస్తామని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి (ఆర్‌ఓ) కీర్తి చేకూరి పేర్కొన్నారు. సోమవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఎన్నికల సంఘం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో, పశ్చిమ నియోజకవర్గ ఆర్‌ఓ, అదనపు కమిషనర్ కె.రాజ్యలక్ష్మీతో కలిసి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రస్తుతం రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎవరైనా ఓటర్ల స్లిప్‌లు ఇవ్వాలి అంటే సదరు స్లిప్‌లో ఏవిధమైన రాజకీయ ప్రచారాలు చేయకూడదని, స్లిప్‌లో రాజకీయ పార్టీల గుర్తులు, రంగులు ఉండకూడదని తెలిపారు. స్లిప్‌లో కేవలం ఓటర్ పేరు, పోలింగ్ కేంద్రం పేరు, ఓటర్ల లిస్టులో సీరియల్ నంబర్ ఉండాలని పేర్కొన్నారు. నామినేషన్ ఫారాలను ముందస్తుగా కొన్ని అందిస్తున్నామని, వాటిని సమగ్రంగా పరిశీలించాలన్నారు. సమావేశంలో ఏఆర్‌ఓలు సునీల్, భీమరాజు తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు జంబో గొడుగులు పంపిణీ

విశాలాంధ్ర-మంగళగిరి: రోడ్డు మార్జిన్లలో చిరువ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగించే నిరుపేదలకు, వేసవి మండుటెండలనుండి కొంత రక్షణ కల్పించాలానే సంకల్పంతో, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మంగళగిరి వారు స్థానిక నిడమర్రు రోడ్ లోని అరవింద స్కూల్ గ్రౌండ్‌లో సోమవారం జంబో గొడుగుల పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ గుంటూరు జిల్లా శాఖ వైస్ ఛైర్మన్ రామచంద్రరాజు గొడుగుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటి తెనాలి చైర్ పర్సన్ ఎం. భానుమతి, డి.ఎస్.పి మహబూబ్ బాషా , ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటి గుంటూరు జిల్లా శాఖ ట్రెజరర్ రవి శ్రీనివాస్, రెడ్ క్రాస్ సొసైటి మంగళగిరి సబ్ బ్రాంచ్ చైర్మన్ ఇసునూరి అనిల్ చక్రవర్తి, వైస్ ఛైర్మన్ గాజుల శ్రీనివాస్ రావు, ట్రెజరర్ అందే మురళి సభ్యులు అందే రేవంత్ కుమార్, బి రంగనాథ్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయినిలకు లీడ్‌స్కూల్ పురస్కారాలు

విశాలాంధ్ర-తెనాలి : విద్యా విధానంలో వస్తున్న నూతన మార్పులకు అనుగుణంగా ప్రతీ విద్యార్థికీ నాణ్యమైన విద్యను అందించి, ఆదర్శవంతమైన ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమే లీడ్‌స్కూల్ విధానం అని ఆ సంస్థ ఆంధ్రప్రదేశ్ రీజనల్ డైరెక్టర్ బి.సుబ్రహ్మణ్యం అన్నారు. స్థానిక బోసరోడ్డులో నెహ్రూనికేతన్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో ప్రస్తుతం కాలంలో విద్యార్థికి అవసరమైన నూతన విద్యావిధానాలను బోధించడంలో అత్యుత్తమ ప్రతిభను కనబరచిన 14 మంది నెహ్రూనికేతన్ ఉపాధ్యాయినీలకు లీడ్‌స్కూల్‌వారి జాతీయ పురస్కారాన్ని అందించారు. సభకు నెహ్రూనికేతన్ మేనేజింగ్ డైరెక్టర్ మురళీకాంత్ వి.దాసరి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ భారతదేశంలో 3 వేలకు పైచిలుకు పాఠశాలలు అధునాతనమైన లీడ్‌స్కూల్‌వారి విద్యావిధానాన్ని అవలంభిస్తున్నట్లు తెలిపారు. అధ్యక్షత వహించిన మురళీకాంత్ మాట్లాడుతూ కాలానుగుణంగా వస్తున్న విద్యా విధానంలో మార్పులను అవగాహన చేసుకుని, ఎప్పటికప్పుడు నవీన ఆలోచనలతో, నూతన పద్ధతులతో విద్యాబోధన చేస్తున్న నెహ్రూనికేతన్ ఉపాధ్యాయులను అభినందించారు. అనంతరం 14 మంది ఉపాధ్యాయినులకు జ్ఞాపికలు, నగదుతో సత్కరించి పురస్కారాలను అందించారు. ఇదే కార్యక్రమంలో లీడ్‌స్కూల్‌వారి ఉత్తమ పాఠశాల పురస్కారాన్ని నెహ్రూనికేతన్ మేనేజింగ్ డైరెక్టర్ మురళీకాంత్ వి.దాసరి అందుకున్నారు. సభలో లీడ్‌స్కూల్ గుంటూరుజిల్లా అకాడెమిక్ మేనేజర్ బి.వి.సుధాకర్ ప్రసంగించారు. కార్యక్రమంలో సుబ్రహ్మణ్యం, సుధాకర్‌లను నెహ్రూనికేతన్ తరపున ఘనంగా సత్కరించారు.

'లోటస్ ఆద్య' పాఠశాల వార్షికోత్సవం

విశాలాంధ్ర-గుంటూరు : స్థానిక కృష్ణనగర్, బ్రాడీపేటల బాలానంద కేంద్రం వారి లోటస్ ఆద్య పాఠశాల 'ఆధ్యాస్ ఆర్మీ కార్నివాలి -2' పేరుతో జరిపిన వార్షికోత్సవం పండుగ వాతావరణాన్ని తలపించింది. చిన్నారులు తమ చిట్టి పొట్టి మాటలు, పాటలు, సాంప్రదాయ, పాశ్చాత్య నృత్యాలతో అలరించారు. తొలుత దీప ప్రజ్వలన అనంతరం ముఖ్యఅతిథిగా పాల్గొన్న యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిప్యూటీ జనరల్ మేనేజర్ సయ్యద్ జవహర్ మాట్లాడుతూ నాలుగు దశాబ్దాల క్రితం పూర్వ విద్యార్థిగా తన ఎదుగుదలకు బాలానంద కేంద్రం వేసిన పునాదులు తన ప్రగతికి ఎంతగానో దోహదం చేసిందన్నారు. ప్రపంచీకరణ నేపథ్యంలో మారుతున్న విద్యార్థుల సమగ్ర విజ్ఞాన, వికాసాన్ని అంది ఇవ్వటంలో 'లోటస్ ఆద్య' పాఠశాల చేస్తున్న కృషికి తల్లిదండ్రులు ప్రోత్సహించటం అభినందనీయమన్నారు. పాఠ్యాంశాల బోధన, వ్యక్తిగత క్రమశిక్షణతో పాటు మానసిక వికాసం కోసం డాన్స్, డ్రామా, మ్యూజిక్, కళలు, సాంస్కృతిక రంగాలలో ప్రోత్సహించడం ద్వారా వారిలో నాయకత్వ లక్షణాలు అలవాడి సంపూర్ణ విద్యార్థులుగా ఎదుగుతారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కమిటీ అధ్యక్షులు డాక్టర్ మానవ రాధాకృష్ణమూర్తి, విద్యావేత్త డాక్టర్ కె.గౌతమి, కమిటీ ఉపాధ్యక్షులు శ్రీనివాస మూర్తి, కార్యదర్శి ఎన్‌వీ గురుదత్, సహాయ కార్యదర్శి కేఎస్‌ఆర్ కుటుంబం రావు, కరస్పాండెంట్ పరుచూరి వెంకటేశ్వరరావు, డైరెక్టర్ యడ్లపల్లి ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, **KASU SAMRAJYAM** (Old Name), W/o. **CHITTEPU SRIDHAR REDDY**, Resident of Door No.78-2-229/F.F, Thunuguntla Vari Street, Lalapet, Guntur - 522003, Guntur District, Andhra Pradesh. I have changed my name as **CHITTEPU SAMBRAJYAM** (New Name) W/o. **CHITTEPU SRIDHAR REDDY**. Hereafter my name is known as **CHITTEPU SAMBRAJYAM** (New Name) W/o. **CHITTEPU SRIDHAR REDDY.**

ఎన్నికల ప్రకటన

ది. కాకతీయ మూచ్‌పల్లి ఎయిడెడ్ త్రిఫ్ట్ అండ్ క్రెడిట్ కో-ఆపరేటివ్ సొసైటి, తెనాలి.
రి.నెం. AMC/GNT/DCO/2001/532

ఎన్నికల ప్రకటన	: 09-04-2024
ఓటర్ల జాబితా ప్రకటన	: 12-04-2024
నామినేషన్ దాఖలుచేయు తేది	: ది.21-04-2024 ఉ॥గం॥10 నుండి మ॥గం॥2ల వరకు.
సమయము, స్థలము	సొసైటీ కార్యాలయము, తెనాలి.
నామినేషన్ల పరిశీలన తేది	: ది.22-04-2024 ఉ॥గం॥10-00నుండి సొసైటి కార్యాలయం, తెనాలి.
నామినేషన్ల ఉపసంహరణ	: ది.23-04-2024 ఉ॥గం॥10-00 నుండి సా॥గం॥5-00ల వరకు సొసైటీ కార్యాలము, తెనాలి.
తుది జాబితా ప్రకటన	: ది.24-04-2024 సా॥గం॥5-00లకు సొసైటీ నోటీసు బోర్డు.
పోలింగ్ తేది, సమయం & స్థలం	: ది.29-04-2024 ఉ॥గం॥8-00ల నుండి మ॥గం॥2-00ల వరక సొసైటీ కార్యాలయము, తెనాలి.
ఓట్ల లెక్కింపు సమయం & స్థలం	: మ॥గం॥3-00ల నుండి సొసైటీ కార్యాలయము, తెనాలి.
ఫలితాల ప్రకటన	: ఓట్ల లెక్కింపు పూర్తిఅయిన వెంటనే సొసైటీ కార్యాలయం,తెనాలి

ఇట్లు
స్థలము: తెనాలి. Sd/ కె. కృష్ణయ్య, ఎలక్షన్ ఆఫీసర్,
తేది : 09-04-2024 అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఆఫ్ కో-ఆపరేటివ్ సొసైటీస్ (రిటైర్డ్)

విశాలాంధ్ర పల్నాడు జిల్లా

భాష్యం లావణ్య ఇంటింటి ప్రచారం

విశాలాంధ్ర-పెదకూరపాడు: ఎన్నికల్లో భాగంగా పెదకూర పాడు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి భాష్యం ప్రవీణ్ సతీమణి లావణ్య పెదకూరపాడులో ఇంటింటి ప్రచారం నిర్వహించింది. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందని, ప్రతి ఒక్కరూ ఆలోచన చేసి తెలుగుదేశం పార్టీ గెలుపు కొరకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ముస్లిం మైనార్టీలు కార్యదర్శి షేక్ నూర్జహాన్, ఎస్.కె ముంతాజు, నాదెండ్ల కల్పన తదితరులు పాల్గొన్నారు.

సాగర్ కుడి కాలువకు తాగునీరు విడుదల

విశాలాంధ్ర-విజయపురిసౌత్: నాగార్జునసాగర్ ప్రాజెక్టు కుడికాలువకు సోమవారం అధికారులు తాగునీటి ని విడుదల చేశారు. కృష్ణానది యాజమాన్య బోర్డు ఈఈ శివ శంకరయ్య పర్యవేక్షణలో కుడికాలువ 5,7వ గేట్ల ద్వారా 5,500 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఈ ఈ శ్రీహరి విడుదల చేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ తాగునీటి అవసరాల నిమిత్తం 5 టీఎంసీల నీటిని రోజుకు 5,500 క్యూసెక్కుల చొప్పున 10 రోజుల పాటు విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈ మురళీధర్, జేఈ బాబుమియా, సిబ్బంది పాల్గొన్నారు.

జగన్‌కు మద్దతుగా వాలంటీర్ల రాజీనామా

విశాలాంధ్ర-వినుకొండ: ముఖ్యమంత్రి జగన్, ప్రజా ప్రభుత్వానికి మద్దతుగా పట్టణంలోని పలువురు వాలంటీర్లు సోమవారం స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. జగనన్న సంక్షేమ పథకాలను ప్రజలకు అందించడంలో కీలకంగా ఉన్న వాలంటీర్ వ్యవస్థపై ఈసీ మరియు తెలుగుదేశం, జనసేన, బిజెపి పార్టీలు విధించిన ఆంక్షలకు నిరసనగా పట్టణ మున్సిపాలిటీ పరిధిలోని హనుమాన్ నగర్, కొత్తపేట సచివాలయంకు చెందిన సుమారు 20 మంది వాలంటీర్లు తమ రాజీనామా పత్రాలను మున్సిపల్ మేనేజర్ శ్రీనివాసరావుకు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా వాలంటీర్లు మాట్లాడుతూ ఇంకనుండి ప్రజా సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లి రాబోయే రోజుల్లో జగనన్నను, శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడును తిరిగి అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని తెలిపారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు

విశాలాంధ్ర-వినుకొండ: పట్టణంలోని క్రిస్టియన్ పాలెం నుండి ఆదివారం అధికార వై.సి.పిని వీడి టీడీపీలోకి 30 కుటుంబాలు చేరారు. వీరందరినీ వినుకొండ నియోజకవర్గ టిడిపి - జనసేన - బిజెపి ఉమ్మడి అభ్యర్థి జీవీ ఆంజనేయులు సతీమణి శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ చైర్మన్ శ్రీమతి గోనుగుంట్ల లీలావతి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

విశాలాంధ్ర-వినుకొండ: స్థానిక టీడీపీ కార్యాలయంలో బొల్లాపల్లి మండలం దోమలగుండం గ్రామం ఎస్. సి.కాలనీ నుండి సోమవారం అధికార వై.సి.పిని వీడి టీడీపీలోకి 10 కుటుంబాలు పోలేపల్లి బాషి పోలేపల్లి నాగయ్య, పోలేపల్లి అచ్చాలు, కొమ్ము రాముడు, కొమ్ము భాస్కరు, కొమ్ము బాలయ్య, పోలేపల్లి పెద్ద గురవయ్య చేరారు. వీరిని వినుకొండ నియోజకవర్గ టీడీపీ -జనసేన - బిజెపిల ఉమ్మడి అభ్యర్థి జీ.వీ ఆంజనేయులు, నియోజకవర్గం పరిశీలకులు మానుకొండ శివ ప్రసాద్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

విశాలాంధ్ర-వినుకొండ: స్థానిక 2వ వార్డు నుండి అధికార వై.సి.పిని వీడి టీడీపీలోకి 20 కుటుం బాలు చేరారు. వీరందరినీ వినుకొండ నియోజకవర్గ టిడిపి - జనసేన - బిజెపి ఉమ్మడి అభ్యర్థి జీవీ ఆంజనేయులు, మాజీ శాసనసభ్యులు మక్కెన మల్లికార్జునరావు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో వినుకొండ నియోజకవర్గం పరిశీలకులు, మానుకొండ శివప్రసాద్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు జీతాలు చెల్లించాలి

మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన

విశాలాంధ్ర-చిలకలూరిపేట: మున్సిపాలిటీ పరిధిలో అవుట్ సోర్సింగ్ విభాగంలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల జీతాలను వెంటనే చెల్లించాలని సీపీఐ ఏరియా ఇన్‌చార్జి కార్యదర్శి నాగభైరు రామ సుబ్బాయమ్మ డిమాండ్ చేశారు. సోమవారం మున్సిపల్ కార్మికులు, పార్టీ నాయకులతో కలసి మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత మూడు నెలల నుంచి జీతాలు నిలిపివేయడం దారుణమని, ఇదే విషయంపై పలుమార్లు మున్సిపల్ కమిషనర్‌ను కలసి విన్నవించినా జీతాలు చెల్లించకపోవడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. పెరిగిన నిత్యావసర ధరలతో చాలిచాలనీ జీతాలతో పారిశుధ్య పనులు నిర్వహిస్తున్న కార్మికుల జీతాలు మూడు నెలల నుంచి చెల్లించకపోవడం బాధాకరమన్నారు. గురువారం సాయంత్రానికే జీతాలు వస్తాయని కమిషనర్ ఇచ్చిన హామీ నెరవేరలేదని తెలిపారు. పారిశుధ్య కార్మికుల చెల్లింపులో నిర్లక్ష్యం పనికిరాదని, వెంటనే జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ ఏరియా అధ్యక్షుడు పేలూరి రామారావు మాట్లాడుతూ కనీసం పారిశుధ్య కార్మికులు పనులు చేయటానికి సరైన పనిముట్లు కూడా లేవని, కనీసం మరమ్మతుకు గురైన పుష్‌కాట్ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని పలుమార్లు కోరినా ఫలితం లేదన్నారు. పనిముట్లు కూడా లేకుండా పారిశుధ్య కార్మికులు పనులు ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. మహిళా సమాఖ్య ఏరియా కార్యదర్శి చెరుకుపల్లి నిర్మల మాట్లాడుతూ మూడు నెలలుగా జీతాలు లేకపోవడంతో వడ్డీ వ్యాపారుల నుంచి ఇబ్బందులు పడుతున్నారని, మరోవైపు డ్వాక్రా పొందిన రుణాలకు కిస్తీలు కూడా చెల్లించక ఒత్తిడికి లోనవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎప్పుడు లేని విధంగా, రాష్ట్రంలో ఎక్కడా లేని పరిస్థితి చిలకలూరి పేటలోనే ఉందని వెల్ల డించారు. ఏఐటీయూసీ అనుబంధ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కొమరగిరి చెంచయ్య మాట్లాడుతూ ప్రభుత్వం చొరవ తీసుకుని వెంటనే పారిశుధ్య కార్మికుల జీతాలు చెల్లించాలని, వారి డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. లేని పక్షంలో శాంతియుత ఆందోళనకు సిద్ధమౌతాయని హెచ్చరించారు. అనంతరం డీఈఈకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బి.భగత్‌సింగ్, యూనియన్ నాయకులు వేల్పుల అంజయ్య, ఆవుల పోతురాజు, యాకసిరి నారాయణ, కొమరగిరి బాలకోటి, పి.సురేష్, మార్తమ్మ, మల్లేశ్వరి, ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ కార్యదర్శి మేకపోతుల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం : జూలకంటి

విశాలాంధ్ర-మాచర్ల: వైఎస్ఆర్సీపీ పాలనలో అవినీతి రాజ్యమేలుతుందని టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ జగన్ పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమం కుంటుబడిందన్నారు. మెగా డిఎస్సి, జాబ్ క్యాలండర్, సీపీఎస్ రద్దు ఎక్కడా అని ప్రశ్నించారు. బీసీల పక్షపాతినంటూ గొప్పలు చెప్పుకునే ముఖ్యమంత్రి ఐదేళ్ల పాలనలో కార్పొరేషన్ల డబ్బులు ఎందుకు పక్కదారి పట్టించాడో సమాధానం చెప్పాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వేలాది అసైన్డ్ భూములను వైసిపి నేతలు కబ్జా చేసిన మాట వాస్తవమన్నారు. మద్యనిషేధంకు కట్టుబడి ఉన్నానంటూ మాట్లాడిన జగన్ మద్యనిషేధం చేయకపోగా 4 రేట్లు మద్యం రేట్లు పెంచిన సంగతి ప్రజలందరికీ తెలుసునన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అక్రమ ఇసుక, గ్రానైట్, మైనింగ్, గ్రావెల్ దోపిడీ విచ్చలవిడిగా జరుగుతున్నా పట్టించుకునే నాధుడే కరువయ్యాడన్నారు. గంజాయి మత్తులో యువత పెడదారి పడుతున్నాడన్నారు. ప్రజలు మార్పు కోరుకుంటున్నారన్నారు. నియోజకవర్గంలో మంచినీటితో ఎద్దడితో ప్రజలు అల్లాడుతున్నారన్నారు. చంద్రబాబు తోనే అభివృద్ధి సంక్షేమం సాధ్యమని, జరగబోవు ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కొమెరా దుర్గారావు, గుమ్మడి నాసరయ్య, నక్షత్రపు ప్రసాద్, కంభంపాటి చంటి, కంభంపాటి అనీల్, మహిళా అధ్యక్షురాలు కృష్ణవేణి, జనసేన నాయకులు పులిహరి, ఓర్సు క్రాంతి కుమార్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పీవోలు బాధ్యతగా పనిచేయాలి : కలెక్టర్

విశాలాంధ్ర-నరసరావుపేట: రానున్న సార్వత్రిక ఎన్నికలలో పీఓలు (ప్రెసైడింగ్ అధికారులు) భయంతో కాకుండా బాధ్యతతో పనిచేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శివ శంకర్ లోతేటి సూచించారు. నరసరావుపేట కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం పీఓలు, ఏఎల్ఎంటీలకు పోలింగ్ సిబ్బందికి శిక్షణను ఇచ్చే కార్యక్రమంపై ఒకరోజు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ జరిగే రోజున జాగ్రత్తగా విధులు నిర్వహించాలని ప్రతికూల పరిస్థితులు ఏమైనా ఎదురైతే చాకచక్యంగా వ్యవహరించి ఎన్నికలు సజావుగా జరిగేలా చూడాలన్నారు. ప్రధాన ఎన్నికల అధికారి సూచనలను ఎప్పటికప్పుడు పాటించాలని తెలిపారు. ప్రిసైడింగ్ అధికారులు విధిగా డైరీలను ఎప్పటికప్పుడు రాసుకోవాలని తెలిపారు. ఈవీఎంలలో ఏమైనా సమస్యలు తలెత్తినట్లయితే వెంటనే పరిష్కరించే విధంగా దానికి సంబంధించిన కమాండ్స్ పై పూర్తిగా అవగాహన కలిగి ఉండాలి అన్నారు. పోలింగ్ సిబ్బంది పోలింగ్ స్టేషన్లో చేరుకున్న వెంటనే అక్కడ సదుపాయాలను పరీక్షించాలన్నారు. ముఖ్యంగా క్యూలైన్ మేనేజ్మెంట్, ర్యాంపు మంచినీటి వసతి సౌకర్యాలుఉన్నాయా లేదా గుర్తించాలన్నారు. ఎలక్షన్ కమిషన్ సూచించిన విధంగా ఫోర్ డే మేనేజ్మెంట్ సిస్టమ్ ను జాగ్రత్తగా అమలుపరచాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఏ శ్యాం ప్రసాద్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీదేవి పాల్గొన్నారు.

ఓటమి భయంతో వైసీపీశ్రేణుల నీచ రాజకీయాలు

విశాలాంధ్ర-సత్తెనపల్లి: చంద్రబాబు ప్రజాగళం సభ సత్తెనపల్లిలో విజయవంతం ఐన సందర్భంగా వైసీపీ నాయకులకు కంటి మీద కునుకులేక ఓటమి భయంతో నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారని మైనారిటీ నాయకులు విమర్శించారు. సోమవారం కన్నా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ప్రజాగళం సభకు రాజుపాలెం, నకిరికల్లు, ముప్పాళ్ల మండలాల నుండి వచ్చే వారి కోసం ఈద్గా పక్కన ఉన్న మైదానంలో భోజన ఏర్పాట్లు చేసామని ప్రశాంత వాతావరణంలో వచ్చిన వారందరు భోజనాలు చేసి వెళ్లారన్నారు. పవిత్రమైన ఈద్గా స్థలంలో ప్రవేశం లేకుండా గేటుకు తాళాలు వేసి పక్కనున్న మైదానంలో అడ్డంగా కర్టన్లు కట్టామన్నారు, కాని సభ, భోజనం కార్యక్రమాలు విజయవంతం ఐన సందర్భాన్ని జీర్ణించుకోలేని కొంత మంది వైసీపీ ముస్లిం నాయకులు అర్ధరాత్రి ఈద్గా మైదానంలో తాగి పడేసిన మందు బాటిల్లు, ఖాళీ గ్లాసులు అక్కడ పడేసి, టిడిపి వారిపై నెపం మోపుతున్నారనీ అన్నారు. ఇమామ్ కూర్చునే నెంబర్ మీద కూడా ఖాళీ సీసాలు, గ్లాసులు పెట్టారంటే వైసీపీ వాళ్ళు ఎంత నీచానికి దిగజారారో తెలుస్తుందన్నారు.వైసీపీ నాయకులు ఎంత దిగజారుడు రాజకీయాలు చేసిన నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరని గ్రహించాలన్నారు. విలేకర్ల సమావేశంలో పల్నాడు జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు సయ్యద్ పెద కరిముల్లా, రాష్ట్ర మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి సయ్యద్ మహబూబ్, రాష్ట్ర మైనారిటీ సెల్ కార్యదర్శి షేక్ జానీ ఖాజావలి, నియోజకవర్గ మైనారిటీ సెల్ అధ్యక్షులు సయ్యద్ ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

24న మంత్రి అంబటి నామినేషన్

విశాలాంధ్ర-సత్తెనపల్లి: సార్వత్రిక ఎన్నికల్లో సత్తెనపల్లి అసెంబ్లీ వైసీపీ అభ్యర్థిగా తాను నామినేషన్ వేయనున్నట్లు మంత్రి అంబటి రాంబాబు తెలిపారు. 10న సిద్ధం సభ పిడుగురాళ్లలో జరుగుతున్న నేపథ్యంలో సమాయత్తం చేసేందుకు నియోజక వర్గంలో పలు సమావేశాలు నిర్వహిస్తున్నారు. 12న రాజుపాలెం నుండి సత్తెనపల్లి మీదుగా గుంటూరు వైపు ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి రోడ్ షో ఉంటుందన్నారు. పిడుగురాళ్ల సిద్ధం సభకు భారీ సంఖ్యలో ప్రజలు హాజరుకానున్నారని తెలిపారు.

పట్టణంలో కన్నా విస్తృత ప్రచారం

విశాలాంధ్ర-సత్తెనపల్లి: అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ సోమవారం పట్టణంలో విస్తృత ప్రచారం చేశారు. చిరు వ్యాపారులతో మాటమంతి కలిపి వారి స్థితి గతులను అడిగి తెలుసుకున్నారు. స్వయంగా వెళ్లి పలకరించి, వారి ఇబ్బందులు గురించి ఆరా తీశారు. త్వరలో తెలుగుదేశం, జనసెన బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని చిరు వ్యాపారులకు అండగా ఉంటాం అని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం రాగానే వ్యాపారులందరికి అన్ని రకాలుగా అండగా ఉంటామని, వ్యాపారం చేసుకోవడానికి అన్ని రకాలుగా సదుపాయాలు కల్పిస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు ఆతుకూరి నాగేశ్వర రావు, మదమంచి రాంబాబు, వివిధ హెూదాల్లో ఉన్న నియోజకవర్గ పట్టణ మండల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓటమి భయంతోనే అక్రమాలు, అరాచకాలు

విశాలాంధ్ర-పెదకూరపాడు: మండల కేంద్రమైన క్రోసూరులో పెదకూరపాడు నియోజకవర్గ టిడిపి కార్యాలయం తగల బెట్టిన వైసిపి మూకలు, క్రోసూరులో జరిగిన ప్రజా గళం సభ సూపర్ సక్సెస్ కావడంతో తట్టుకోలేక ఓటమి భయంతోనే శంకర్రావు నియోజకవర్గంలో దాడులు, అక్రమ కేసులు, అరాచకాలతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి అక్రమంగా గెలి చేందుకు కోటి ప్రయత్నాలు చేస్తున్నారని పెదకూరపాడు నియోజకవర్గ మాజీ శాసన సభ్యులు కొమ్మాలపాటి శ్రీధర్, నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి భాష్యం ప్రవీణ్ అన్నారు. సోమవారం వారు మీడియాతో మాట్లాడుతూ ప్రజాగళం చంద్రబాబు సభ సక్సెస్ అవటమే కాక నియోజకవర్గం నుండి వేలాదిమంది కార్యకర్తలు పాల్గొనడంతో తట్టుకోలేక పార్టీ కార్యాలయాలు దహనం, గ్రామాలపై రౌడీ మూకలతో దాడులకు యత్నం వంటి అరాచకాలతో ఉసుగొలిపి అలజడులు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్న శంకర్రావుకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.

చండ్ర రాజేశ్వరరావు వర్ధంతి

విశాలాంధ్ర-పెదకాకాని: సీపీఐ అగ్రనేత, పోరాట యోధుడు కామ్రేడ్ చండ్ర రాజేశ్వరరావు 30వ వర్ధంతి సందర్భంగా పెదకాకాని గ్రామ పార్టీ ఆఫీసు నందు సీపీఐ నాయకులు వారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పొన్నూరు నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి పుప్పాల సత్యనారాయణ మాట్లాడుతూ కామ్రేడ్ చండ్ర రాజేశ్వరరావు జమీందారీ కుటుంబంలో జన్మించినప్పటికీ ఆనాటి భారత కమ్యూనిస్టు పార్టీ ఆశయాలను అందిపుచ్చుకొని ఆనాటి జమీందారీ వ్యవస్థ, పెత్తందారి వ్యవస్థలను ఎదిరించి తన ఆస్తులను సైతం ప్రజలకు పంచి పెట్టి సీపీఐ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికై దున్నేవాడిదే భూమి పండించేవాడు వాడే ఆసామి అనే నినాదంతో దేశవ్యాప్తంగా భూ పోరాటాలు కొనసాగించి అనేకమంది పేదలకు పంట భూములు బంజర భూములు ఇళ్ల స్థలాలు పంచి ఇచ్చిన ఘనత ఆయనకే దక్కుతుందని అన్నారు. ఆయన ఆశయాల సాధనకు యువతి యువకులు విద్యార్థులు కృషి చేయాలని మరీ ముఖ్యంగా రానున్న ఎన్నికలలో ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించి నిజాయితీ నిబద్ధత కలిగిన వ్యక్తులను ఎన్నుకొని ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా మహిళా సమైక్య కార్యదర్శి రెంటాల కుమారి, గొట్టంటి రమణ కుమార్, గోపి, సుబ్బారావు, బొట్టు శ్రీనివాసరావు, ఆర్ మోజెస్ బాబు, దర్శి లింగారావు, గంగ తదితరులు పాల్గొన్నారు.

సిట్ అధిపతి రఘురామరెడ్డిని సస్పెండ్ చేసి విచారణ జరిపించాలి: జీవీ

విశాలాంధ్ర-వినుకొండ: తాడేపల్లి సిట్ కార్యాలయంలో కీలక పత్రాల దహనం ఘటనలో ఆ విభాగం అధిపతి కొల్లి రఘు రామరెడ్డిని తక్షణం సస్పెండ్ చేసి సమగ్ర విచారణ జరిపించాలని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు. డిమాండ్ చేశారు. రఘురామరెడ్డిని వ్యక్తిగతంగా కూడా ఈ కేసులో బాధ్యుడిని చేసి చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. విపక్షాలను వేధించడం కోసం అక్రమ మార్గాల్లో సంపాదించిన వివరాల్ని గుట్టుగా తగలబెట్టేశారని నిప్పులు చెరిగారు. రాష్ట్రవ్యాప్తంగా పెనుసంచలనం సృష్టించిన సిట్ ఫైళ్ల కాల్చివేతపై సోమవారం రాత్రి వినుకొండలో మీడియా సమావేశం నిర్వహించారు జీవీ. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో చంద్రబాబు, లోకేష్‌ను ఇబ్బంది పెట్టడానికి గతంలో సీఐడీ, సిట్ హెరిటేజ్‌పై అనేక అక్రమ పత్రాలు తయారు చేశారని, ఇప్పుడు ప్రభుత్వం మారుతోందని వాటన్నింటినీ తగలబెట్టేశారని ధ్వజమెత్తారు. స్కిల్ కేసు నుంచి ఇన్నర్ రింగ్ రోడ్ కేసు వరకు కీలకఫైళ్లు కాల్చిబూడిద చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జరిగిన దారుణంపై సిట్ అధిపతి రఘురామరెడ్డిని విధుల నుంచి ఇంకా ఎందుకు సస్పెండ్ చేయలేదని సీఎస్, డీజీపీ, ప్రభుత్వానికి సూటి ప్రశ్నలు సంధించారు. ఇదే నాడు తప్పుడు కేసులు పెట్టి వేధించిన వాళ్లే ఈ రోజు పేపర్లు తగలబెట్టుకున్నారంటే వాళ్ల దుస్థితి ఏమిటో ప్రజలు అర్థం చేసుకోవచ్చన్నారు జీవీ. మరికొన్ని రోజుల్లో ప్రభుత్వం మారుతుందని, జూన్ 4న చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేస్తున్నారని భయపడేసిట్ ఇలా ఆధారాల ధ్వంసానికి పూనుకుందన్నారు. జగన్ కుట్రల్లో భాగమైన సిట్ అధికారులు తమపై చర్యలు తప్పించుకోవడానికే పత్రాలు తగలబెట్టారని ఆరోపించారు జీవీ. అనంతరం పెదకూర పాడు క్రోసూరులో తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని తగలపెట్టిన ఘటనపైనా ఘాటు వ్యాఖ్యలు చేశారు. చంద్రబాబు సభకు వచ్చిన ప్రజా స్పందనను చూసి ఓర్చుకోలేకే ఎమ్మెల్యే శంకర్రావు రౌడీమూకలను పంపి తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని తగలబెట్టించారన్నారు. ఎవరు ఏం చేసినా భాష్యం ప్రవీణ్ పెదకూరపాడులో భారీ ఆధిక్యంతో గెలవబోతున్నాడని ధీమా వ్యక్తం చేశారు. అంతేకా ఇసుక భకాసురుడిగా మారిన శంకర్రావు చంద్రబాబుపై చేసిన విమర్శలను తీవ్రంగా ఖండిస్తున్నామని జీవీ పేర్కొన్నారు.

నోరు మెదపని జగన్.. నిరుత్సాహానికి గురైన వైసీపీ శ్రేణులు

విశాలాంధ్ర-వినుకొండ: అదుగో అన్న వస్తున్నాడు.. ఇదిగో అన్న వచ్చాడు.. అంటూ పెద్ద ఎత్తున అధికార పార్టీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఆధ్వర్యంలో, ఎంపీ అనిల్ కుమార్ నాయకత్వంలో ప్రతిష్టాత్మకంగా తీసుకొని వారం రోజులుగా సోమవారం జరిగే సిద్ధం సభకు జన సమీకరణ చేశారు. అనుకున్న ప్రకారం ఎంతో కొంత ఐదు మండలాల నుంచి వైసీపీ శ్రేణులను వినుకొండ పట్టణంలోని శివయ్య స్తూపం సెంటర్‌కు చేరవేశారు. వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి మాట్లాడేందుకు వీలుగా లైటింగ్, మైకు సెట్లతో ఏర్పాట్లను పెద్ద ఎత్తున పూర్తి చేశారు. ఉదయం నుండి ఎదురుచూసిన వైసీపీ శ్రేణులకు జగన్ నోరు మెదపకపోవడంతో తీవ్ర నిరుత్సాహం తప్పలేదు. జగన్ కేవలం చేతులతో అభివాదం చెబుతూ ముందుకు సాగిపోయారు. ఎంతో వ్యయ ప్రయాసలకు ఓర్చి సిద్ధం బస్సు యాత్రకు వచ్చిన వైసీపీ శ్రేణులు బిక్కమొకాలు వేసుకొని వెనుతిగారు. పెద్ద ఎత్తున దీనిపై వైసీపీ శ్రేణుల్లో నాయకుల్లో చర్చ మొదలైంది..! ఎందుకు మాట్లాడలేదు..? మాట్లాడక పోవడానికి గల కారణాలేంటి..? కనీసం ఐదు నిమిషాలైనా మాట్లాడవచ్చు కదా..? కేవలం రోడ్డు షోకే ఎందుకు పరిమితమయ్యారు..? వినుకొండ నేతలపై అసంతృప్తా..? లేదా ఆరోగ్య సమస్యలా.. మరే ఇతర కారణాలు అనేది ఆ పార్టీ వర్గాలు మాత్రమే ధ్రువీకరించాలి. దీనిపై ప్రత్యర్థి తెలుగుదేశం పార్టీ మాత్రం నవ్వుకుంటూ ఆ పార్టీ నవ్వులు పాలైందని జగన్ జనంలో ఏం మొహం పెట్టుకొని మాట్లాడతారని ఎద్దేవాలు మొదలయ్యాయి..! జగన్ ఏదో మాట్లాడుతాడు దానికి కౌంటర్ కూడా సిద్ధం చేసుకుని ప్రెస్మీట్‌కు కూడా ప్రతిపక్ష కూటమి టీడీపీ అభ్యర్థి జీవి ఆంజనేయులు సమయాన్ని కూడా ముందుగానే ప్రకటించారు. ఆయన ఏమీ మాట్లాడకపోవడంతో జగన్ బస్సు సభ కాస్త తుస్సుమనిందని మాట్లాడుతూ ఎద్దేవా చేయడం కనిపించింది.

బటన్ నొక్కడమే కాని... నిధులు మంజూరేది ?

విశాలాంధ్ర-చిలకలూరిపేట: సంక్షేమ పథకాలపై గొప్పగా ప్రచారం చేసుకుంటూ సీఎం జగన్ ఆర్భాటంగా బటన్ నొక్కడం తప్ప.. లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో మాత్రం డబ్బులు జమకావడం లేదని జనసేన పార్టీ సెంట్రల్ ఆంధ్ర కో-కన్వీనర్ పెంటేల బాలాజి విమర్శించారు. సోమవారం తన కార్యాలయంలో మాట్లాడుతూ ముందుగా రాష్ట్ర ప్రజలకు శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. డ్వాక్రా మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు తమ ప్రభుత్వం అండగా ఉంటుందని, అందుకు వడ్డీ మాఫీ వర్తింపజేస్తామని చెప్పి నిధులు విడుదల చేసి రెండు నెలలు అయినా వడ్డీ మాఫీ రుణం పడక డ్వాక్రా మహిళలు తీవ్ర ఆవేదన చెందుతున్నారని వివరించారు. జగనన్న విద్యాదీవెన పెట్టి ఏటా తానే ఫీజులు చెల్లిస్తున్నట్లు చెబుతున్నారు. కానీ వాస్తవంగా విద్యాదీవెన పథకం నిధులు విడుదలై నెల అయినా ఆ డబ్బులు పడక కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులను ఫీజుల కోసం ఒత్తిడి చేస్తున్నాయని ఆరోపించారు. 45 ఏళ్లు దాటిన ప్రతి మహిళకు ఈబీసీ నేస్తం కింద ఏడాదికి రూ.15 వేలు అందిస్తానని డప్పు కొట్టి గతనెలలో ప్రకాశం జిల్లాలో సీఎం బటన్ నొక్కారని, ఇంత వరకు మహిళల ఖాతాల్లో రూపాయి పడలేదని మండిపడ్డారు. మోసపూరిత హామీలతో, కట్టుకథలతో తిరిగి సీఎం కావాలని జగన్ శతవిధాలుగా ప్రయత్నిస్తున్నారని, రానున్న ఎన్నికల్లో వైపీపీకి ప్రజలు గుణపాఠం చేప్పేందుకు సిద్ధమవుతున్నారని తెలిపారు.

నిరాధార ఆరోపణలు తగదు

విశాలాంధ్ర-పెదకూరపాడు: క్రోసూరులో టీడీపీ కార్యాలయం వద్ద పందిరి దగ్ధమైన ఘటనలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి భాష్యం ప్రవీణ్ పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావుపై అనుచిత వ్యాఖ్యలు చేయటం తగదని ఈద సాంబిరెడ్డి అన్నారు. పెద్దకూరపాడు వైసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్లుగా పెదకూరపాడులో ప్రశాంత వాతావరణం ఉందని.. కానీ టీడీపీ అభ్యర్థిని ప్రకటించిన రోజు నుంచి ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయన్నారు. టీడీపీ కార్యాలయం వద్ద పందిరి దగ్ధమైన ఘటనతో తనకేం సంబంధం అని ప్రశ్నించారు. కార్యకర్తలు, బైకులు, కుర్చీలు అన్నీ క్షణాల్లో మాయం చేసి.. వాళ్లే పందిరి తగలబెట్టుకున్నారన్నారు. గతంలో ధరణికోటలో తమ వైఎస్సార్సీపీ పార్టీ కార్యాలయాన్ని తగలబెడుతూ ఇద్దరు టీడీపీ కార్యకర్తలు రెడ్ హ్యాండెడ్ గా దొరికిపోయారన్నారు. ఇప్పుడు ఎవరు నిప్పు అంటించారో తెలియదంటూనే.. తమపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య, ఎస్.కె మస్తాన్ షరీఫ్, వెళల్చెరు సురేష్, బి రాజేంద్ర బాబు తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు ఉగాది వేడుకలు

విశాలాంధ్ర-రెంటచింతల: మండల కేంద్రమైన రెంటచింతల లోని ఫాతిమా విద్యానికేతన్ పాఠశాలలో సోమవారం నిర్వహించిన ముందస్తు ఉగాది వేడుకలు అలరించాయి. ఉపాధ్యాయులు, విద్యార్థులు తెలుగుదనం ఉట్టిపడేలా సంప్రదాయ దుస్తులు ధరించారు. పాఠశాలలో షడ్రుచుల సమ్మేళనంతో తయారు చేసిన ఉగాది పచ్చడిని విద్యార్థులకు పంచిపెట్టారు.ఈ కార్యక్రమంలో తెలుగు పండిట్ షేక్ అబ్దుల్లా శ్రీ క్రోదినామ సంవత్సర ఉగాది పర్వదిన పంచాంగాన్ని విద్యార్థులకు అర్థమయ్యేలా తెలియచేసి పండగ యొక్క ప్రాముఖ్యతను విద్యార్థులకు తెలియచేసారు. పాఠశాల హెచ్.ఎమ్ ఏరువ. స్టెఫీ స్టార్, పాఠశాల డైరెక్టర్ ఏరువ మర్రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాల్లో రేషన్ మాయం

విశాలాంధ్ర-తాడేపల్లి: ఉండవల్లి, పెనుమాక గ్రామాల్లో రేషన్ మాయం కొన్ని నెలలుగా కొనసాగుతుంది. ఉండవల్లి షాప్ నెంబర్ 33 లో ఒక టన్ను, పెనుమాక షాప్ నంబర్ 1 లో మూడు టన్నుల రేషన్ మాయం అయినట్టు సమాచారం. ప్రతి నెలా ఈ రెండు డిపోలలో మాత్రమే టన్నుల కొద్దీ బియ్యం తగ్గటం పలు అనుమానాలకు తావిస్తోంది. ఇంత జరుగుతున్నా డిపోల వైపు కన్నెత్తి చూడని రెవెన్యూ అధికారులు. ఈ రెండు డిపోలల్లో ప్రతి నెల రేషన్ తగ్గుతున్న వీరినే డీలర్లుగా కొనసాగించటం వెనుక కారణం ఏమిటని వినియోగదారులు ప్రశ్నిస్తున్నారు. రేషన్ పంపిణీ చేసే వ్యాన్ డ్రైవర్స్ ప్రతి 2 నెలలకు కొత్తవారు రావడం వెనుక కారణం ఏంటని కార్డు దారులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. దీని పై కార్డు దారులు ప్రశ్నించగా పై నుంచి రేషన్ తగ్గి వస్తున్నట్లు వ్యాన్ డ్రైవర్ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పినట్లు తెలుస్తోంది.

బ్రహ్మయ్య హత్య కేసు దర్యాప్తు ముమ్మరం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : బ్రహ్మయ్య హత్య కేసు దర్యాప్తు ముమ్మరం చేస్తామని, విచారణాధికారిగా అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావును నియమిస్తున్నట్లు గుంటూరు ఎస్పీ తుషార్ తెలిపినట్లు దళిత, బహుజన, ప్రజా సంఘాల నాయకులు తెలిపారు. సోమవారం ఉదయం నాదెండ్ల బ్రహ్మయ్య హత్య కేసు నత్త నడకన సాగుతుందని ఆరోపిస్తూ మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాదరావు, దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొరివి వినయకుమార్, జనచైతన్య వేదిక అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి, బ్రహ్మయ్య భార్య సామ్రాజ్యం, కూతురు మణి చందనలతో కలిసి దళిత, బహుజన, ప్రజా సంఘాల నాయకులు గుంటూరు జిల్లా ఎస్పీ తుషార్‌ను జిల్లా ఎస్పీ కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ బ్రహ్మయ్య కేసుకు సంబంధించి కేసు విచారణాధికారిగా జిల్లా అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావుని నియమించి విచారణను వేగవంతం చేయనున్నట్లు జిల్లా ఎస్పీ పేర్కొన్నట్లు చెప్పారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాదరావు మాట్లాడుతూ బ్రహ్మయ్యను తామే హత్య చేశామని న్యూ డెమొక్రసీ నాయకులు లేఖను విడుదల చేసినప్పటికీ పోలీసులు ప్రేక్షక పాత్రను పోషిస్తుంటే నేరస్తులకు చట్టం పట్ల భయం ఎలా ఉంటుందని ప్రశ్నించారు. కొరివి వినయ కుమార్, వల్లంరెడ్డి లక్ష్మణ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పేద, దళిత, గిరిజన కులాలకు ఒక న్యాయం, ఆగ్ర కులాలకు మరొక న్యాయం చేయడం అన్యాయమని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో దళిత, దళిత, బహుజన, ప్రజా సంఘాల ఐక్య వేదిక కన్వీనర్ శిఖా సురేష్, రత్నశ్రీ, డెన్నిస్ రాయ్, జీఆర్ భగత్ సింగ్, బత్తుల వీరాస్వామి, పాటిబండ్ల కోటేశ్వరరావు, చిన్నం దేవిడ్ విలియమ్స్, జూపూడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సంఘటన కారకులపై తక్షణమే కేసు నమోదు చేయాలి

విశాలాంధ్ర-సత్తెనపల్లి : డూండీ రాజేష్ రాజకీయ ఎదుగుదల చూసి ఓర్చుకోలేకే వెల్లంపల్లి శ్రీనివాస్ దర్శకత్వంలో ఆదివారం విజయవాడలో మఫ్టి పోలీసుల దాడి చేసి నిర్బంధం చేయటాన్ని తీవ్రంగా ఖండిస్తు న్నామని, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి చౌట శ్రీనివాసరావు అన్నారు. సోమవారం రఘురాం నగర్‌లో ఉన్న ప్రజా వేదికలో తెలుగుదేశం పార్టీ వాణిజ్య విభాగం బాధ్యులు విలేకరులతో మాట్లాడుతూ ఆదివారం విజయ వాడలో ఉన్న అమ్మ కళ్యాణ మండపంలో అర్బన్ జిల్లా ఆర్య వైశ్య సంఘం ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి నిర్వహకుల ఆహ్వానం మేరకు బోండా ఉమా మహేశ్వరరావు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర వాణిజ్య విభాగం అధ్యక్షులు డూండీ రాజేష్‌లు పాల్గొన్నారు. అలాగే మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ కూడా పాల్గొన్నారు. ఇదే సమావేశంలో వెల్లంపల్లి అనుచరులు వెల్లంపల్లి డైరెక్షన్‌లో ఉద్దేశ్యపూర్వకంగా డూండీ రాజేష్‌పై దాడికి ప్రయత్నం చేయటమే కాక, ఇదే వెల్లంపల్లి డైరెక్షన్‌లో మఫ్టి పోలీసులు రాకేష్ చొక్కా పట్టుకొని సభా సాక్షిగా బలవంతంగా జీపులోకి ఎక్కించి మరీ రాకేష్‌ను మ్యాన్ హ్యాండ్లింగ్ చేయటాన్ని తీవ్రంగా ఖండించారు. దీనికి సంబంధించిన సీసీ పుటేజ్‌లను పరిశీలించి ఈ సంఘటనకు కారకులైన వారిపై తక్షణమే కేసు నమోదు చేసి, ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సమయంలోనే ఇంత దౌర్జన్యం జరిగితే అది రాష్ట్ర వాణిజ్య విభాగం అధ్యక్షుని పైనే ఇలా జరిగితే ఇతర సామాన్య ప్రజల యొక్క పరిస్థితి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదని అన్నారు. వెల్లంపల్లి శ్రీనివాస్ కు ఘోర ఓటమి తప్పదని అన్నారు. ఈ సమావేశంలో తెదేపా అధికార ప్రతినిధి దివ్వెల శ్రీనివాసరావు, వాణిజ్య విభాగం నియోజక వర్గం అధ్యక్షులు నోముల వెంకట రమణ, పట్టణ అధ్యక్షులు బచ్చు కొండలు, సీనియర్ నాయకులు జవ్వాజి రామమోహనరావు, పోతుగంటి రామ కోటేశ్వరరావు, దూపగుంట్ల జానకి రామారావు, దేవతి శివ ప్రసాద్, యక్కల సుబ్బారావు మరియు బాలనాగు శివ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వేలం ప్రకటన

మహారాజశ్రీ గురజాల సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్)వారి కోర్టులో
E.P No. 40 / 2022 in O.S No. 134 / 2016
Between:
దేవిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి ...డి.హెచ్.ఆర్
మరియు
పనితి రత్నకుమార్ ...జె.డి.ఆర్.
ఈ క్రింది షెడ్యూలు దాఖలు స్థిరాస్తిని పై కోర్టు వారు ది.24-04-2024వ తేదీన ఉ॥గం॥10:30ని॥లకు లగాయతు బహిరంగ వేలం వేయుదురు. కావున పాటదారులు వేలం షరతులు కోర్టులో తెలుసుకొని పాటలో పాల్గొనవచ్చును.
షెడ్యూలు:గుంటూరు జిల్లా, నరసరావుపేట రిజిస్ట్రేషన్ జిల్లా, పిడుగురాళ్ల సబ్ రిజిస్ట్రార్ ఇలాకా, పిడుగురాళ్ల మున్సిపాలిటీ పరిధి, పిడుగురాళ్ల గ్రామ D.No.130/16A-3A, కల్లం టౌన్‌షిప్ ఏరియాలో D.No.8-1-1లో Ac.1.00లో Ac.0.30 సెంట్లకు హద్దులు.తూర్పు:బజారు, దక్షిణం: సాతులూరి రామాంజనేయులు పొలం, పడమర: పనితి జాన్ కనకయ్య పొలం,ఉత్తరం :బాట.
డి.హెచ్.ఆర్ విలువ : రూ.2,00,000/-
అమీనా విలువ : రూ.10,00,000/-
వేలం తేదీ : ది.24-04-2024
ఫర్దర్ హియరింగ్ :01-05-2024
నోట్: ఇ.సి. దాఖలా అన్యాక్రాంతములు లేవు.
ఎం. ప్రసాదరావు, కె. ఏడుకొండలు.
డి.హెచ్.ఆర్.తరపున అడ్వకేట్లు,గురజాల.